కథానిక

అతడు నేర్వలేని పాటలు

టి. జగన్మోహనరావు

అతని నిరుత్సాహానికి కారణం ఎవ్వరికీ తెలిసింది కాదు. జీవితంలో ఆశ అంతరించిందనుకున్నాడు. ఇంక నూతన అనుభవాలేవీ కలుగవనుకుని జరిగిపోయిన సంఘటనలకు ఒక నిట్టూర్పు విడిచేవాడు. కాని తను చేసిన దాంట్లో తప్పేమీ లేదనే అతని విశ్వాసం. జీవితం స్వప్నంలాగా గడచిపోవాలని కోరిక వుండేది. రెండేళ్ళలోనే స్వప్నాలలో కాంక్షించిన ప్రపంచం తారుమారై ఎంతో దూరమైపోయింది.

అతని పెళ్ళి జరిగి రెండు సంవత్సరాలయింది.

అంతవరకు కష్టమో సుఖమో కాలం బాగానే గడచిపోయింది. బాధ్యతలేమిటో ఎరగని దినాలలో కులాసాగా వుంటూండేవాడు. విద్యార్థిదశలో ఒక కల్పిత నాగరికతను అలవరచుకొని గగన కుసుమాలకోసం బంగారపు రెక్కలు కట్టుకొని ఆకాశంలో విహరిస్తుండేవాడు. తాను రాసిన పాటలనే పాడుకొంటూ ఆనందిస్తూండేవాడు. మనసులో అనుమానాలేవీ వుండేవికావు. అతని రెండుకళ్ళకు ఎదురుగా రాజమార్గం ఒకటి కనిపించేది. తనకొరకు నిర్ణీతమై ఒక ఉన్నతస్థానము కలదని అతని నమ్మకం. మనోనేత్రంతో అటు చూసినప్పుడు అతనికి సంతోషాన్ని కలిగించే దృశ్యాలేవో కనిపించేవి.

చదువు పూర్తి కాకముందే అతని వివాహం జరిగింది. కొంతకాలం బాగానే కాలక్షేపం అయింది. భార్యతో పాటు భాగ్యంకూడా వచ్చింది. గర్వంతో చిరునవ్వు నవ్వేవాడు స్నేహితులతో వున్నపుడు. అందని వస్తువులు కొన్ని అందుబాటులోనికి వచ్చాయి. కాని ఎక్కడో మనసులో గాయం ఒకటి ఏర్పడింది. దానిస్వభావం అతనికే అర్థం అవలేదు. ఏమిచేయాలోకూడ తోచలేదు. అప్పుడప్పుడు మాత్రం అనుకోకూడని ఆలోచనలు కలిగేవి. అవికూడా అతని మనసులోని మచ్చను తుడవలేకపోయేవి.

త్వరలోనే వివాహంతో వచ్చిన సిరియొక్క ఆకర్షణ తగ్గిపోయింది. ధనంతో కొనగల ముచ్చటల్నీ అనుభవించాడు. వాటికి విలువ ఏమీ కనిపించలేదు. అంతవరకు అతని జీవితంలో ఎదుర్కొనవలసిన సమస్య ఒకటే అని తోచింది. ఆ ప్రశ్న యిప్పుడు తీరిపోయింది. అంతకన్నా ప్రధానమైనది, తాను సాధించలేక పోయినది, మరొకటి అతన్ని వేధించడం మొదలు పెట్టింది. నిత్యజీవితంలో పరిమళం పోకుండా వుండాలంటే ఏమిచేయాలో తెలిసింది కాదతనికి. అసలు ఆ విషయాన్నే అతనెప్పుడూ తర్కించి ఎరుగడు.

అనేక భావాలమధ్య నలిగిపోయేవాడతను. సరస్వతి మూర్ఖురాలని తలచుకొన్నప్పుడల్లా ఎంతో భయంగావుండేది. ఆమెకు చదువు చెప్పించనందుకు మామగారిని తూలనాడేవాడు. ఆమె గూడ తనలాగే ఆకాశంలో వెన్నెల మబ్బుల మీద ప్రయాణంచేస్తూ నక్షత్రాలతో మాట్లాడలేదేమో అని అతని విచారం. దేవుళ్ళందరూ ఏకమై తన ఆనందాన్ని సహించలేక పోతున్నారని విసుక్కునేవాడు. ఏమిచేసినా హృదయంలో భారం తగ్గేది కాదు. కొన్నాళ్ళు భార్యతో మాట్లాడలేదు. ఆ ఉద్వేగంలో శాంతి కలిగిందనుకునేవాడు. కాని సరస్వతి సహనంవల్ల అతని పగతీరకపోవటమే కాకుండా, అతని దృష్టిలోనే అతను చాల అల్పంగా కనిపించటం జరిగేది.

* * *

అతనెప్పుడూ చర్చించుకొనని సంగతి అతని పెళ్ళి. ఆ విషయమై అతనికేమీ ఉద్దేశ్యంలేదు. అతను లాకాలేజీలో వున్నప్పుడు అతన్నిచూడటానికి ఆడపిల్లల తండ్రులు వస్తూపోతుండేవారు. తనతండ్రిని చూడమని చెపుతూ వుండేవాడు. సరదా ఉండేది. అతని తండ్రికి ఆనందం, అహంకారంకూడా ఉండేవి. అన్ని పరీక్షలలో

ప్రతిభావంతంగా ఉత్తీర్ణు డవుతుండే కొడుకు తప్పకుండా జడ్జీపదవిని పొందుతాడని అనుకొనేవాడు.

కాలేజిలో చదువుతున్న రోజులలో ఒక్క రోజు మాత్రం అతనెప్పుడు స్మరించుకొనేవాడు. ఒకనాడు తండ్రివద్దనుండి వార్త రాగా యింటికి వెళ్ళాడు. తండ్రిని కలిసికొన్న తర్వాత అంతా తెలిసింది. తాను చూడబోయే పెళ్ళికొమార్తె తండ్రి గొప్ప భూస్వామి అనీ, తన కనేక విధాల తోడ్పడగలడనీ, తెలిసికొన్నాడు. మంచి సాంప్రదాయంగల కుటుంబమని తండ్రి మెచ్చుకున్నాడు.

తండ్రి చెల్లెలుతో కలిసి వెళ్లాడు పిల్లను చూడటానికి. ఒక రోజంతా వున్నారక్కడ. ఎన్నో మర్యాదలు పొందారు. ప్రపంచంలో అందరూ తనెంతో ధన్యుడని అనుకుంటున్నట్టు తోచిందతనికి. ఆరోజు నాటకంలో తన భాగం ఏమిటో అతనికేమీ అవగాహన కాలేదు. కాబోయే భార్య చుట్టాల దృష్టిలో తనెంతో పెద్దవాడైనట్లు గ్రహించాడు. అతనికి తెలియకుండానే మనసులో ఏదో దృఢమైన భావము కలిగింది. తన మామగారి యింటినిండా వెండి బంగారాలే. అతను త్రాగిన కాఫీకంటె కాఫీ పోసిన కప్పు, సాసరు ఎంతో రమ్యంగావున్నాయి. ఆ యింట్లో వున్న అందమైన వస్తువులను చూస్తూ ఊహా ప్రపంచంలో లీనమైపోయాడు. తన మామగారు కూడ చాలా ఆదర్శములు కలిగి నటువంటి వ్యక్తి అనుకున్నాడు.

ఆరోజు సాయంత్రం పెళ్ళికూతుర్ని చూశాడు. మెరపును చూసినట్లుందతనికి. ఒంటినిండా నగలు. ఎంతో అలంకారంచేశారు. చూడగానే బాగానే వున్నట్లు కనిపించింది. పేరేమిటని అడగానే స్ఫుటంగా 'సరస్వతి' అని చెప్పింది.

"లక్ష్మీ సరస్వతులు కలిశారు" అన్నాడు అతని తండ్రి.

"అయితే చదువు బాగానే వచ్చన్నమాట."

"ఇంట్లోనే చెప్పిస్తున్నాం" అన్నాడామె తండ్రి.

'సంగీతం చెప్పిస్తున్నారా?'అని అడిగాడతను.

లోపలినుంచి వీణ తెప్పించాడామెతండ్రి. ఆమెపాటలను కూడా చాలా మెచ్చుకున్నారు తండ్రీ కొడుకులు. అతనెంతో సంతృప్తిపడ్డాడు ఆరాత్రి అతని తండ్రి కట్నాలు కానుకల సంగతి తేల్చుకున్నాడు. ముహూర్తం కూడ నిశ్చయం చేసుకొనే మర్నాటి వుదయం వెళ్ళిపోయారు.

* * *

రెండు సంవత్సరాలలో అనుకోని మార్పు కలిగిందతని జీవితంలో. అంతటికీ తన వివాహమే కారణం అనుకున్నాడు. అతనిలో గాఢమైన అసంతృప్తి బయల్దేరింది. సరస్వతిలో ఆనాడు తను చూచిన మెరపు నేడు కనిపించటం లేదు. తనకున్నంత చదువులేదామెకు. అతని నాగరికత యొక్క వైచిత్రి ఆమెలో మార్పును తీసికొనిరాలేకపోయింది. ఆమెమాత్రం భర్తను భగవంతుడిలా చూసేది. ఆమెలోలేని శక్తులకామెను నిందించేవాడతను.

ఆమెవాళ్లందరు తనను మోసం చేశారని అంటూండేవాడెప్పుడూ.

చాలకాలం శాంతంతోటే వినేది అతని మాటల్ని. తాను చేసిన నేరమేమిటో ఆమెకు తోచలేదు. కాని త్వరలోనే అతని నిస్పృహకు అసంతృప్తికికారణం గ్రహించింది. అయినా మనసులో కూడా దూషించేది కాదనిని.

ఆమె ఓరిమి ఎక్కువైన కొద్దీ అతని ప్రవర్తన దుస్సహం కాజొచ్చింది. ఆమె యెడల వైముఖ్యంగూడ ఎక్కువయింది. ఒకనాడామె భర్తనెంతో నెమ్మదిగా అడిగింది: అతని విచారానికి కారణం ఏమిటని.

'నిన్ను పెళ్లిచేసుకొనడమే' అన్నాడు.

'అందులో నా తప్పేముంది' అన్నదామె.

ఎన్నడు మాట్లాడని ఆమె ఆవిధంగా జవాబు చెప్పేసరికి అతడు సమాధానం చెప్పలేకపోయాడు వెంటనే.

'అంతా మోసం...' అని మాత్రం మామూలు ధోరణిలో అన్నాడు.

'ఏవిధంగా' అంది.

కోపంతో వెళ్ళిపోయాడు.

ఆ తర్వాత ఎప్పుడింటికి వచ్చేవాడో, ఏమి చేసేవాడో ఆమెకు ఏమాత్రం తెలిసేదికాదు.

ఒకనాడతను రాత్రి యింటికి వచ్చిన తర్వాత ఆమె ఎక్కడా కనిపించలేదు. ఇల్లంతా వెతికాడు. చాలా ఆదుర్దా పడ్డాడు. నిశ్చేష్టుడై క్రింద

కూలిపోయాడు. అతనేం చూస్తున్నాడో అతనికే తెలిసిందికాదు. విచిత్రమైన దృశ్యాలు ఎన్నో కనబడ్డాయి.

ఒకసారి బంగారువన్నెగల చేప చక్కని తామరు కొలనులోనుంచి పైకి ఎగిరి ఆకాశంలో విహరిస్తున్నట్లు; కొంతసేపటికి ఎక్కువ ఆయాసం రాగా ఎగరలేక కొట్టుకుంటూ భూమిమీద పడి నీళ్లకోసం దిగులు పడుతున్నట్లు...

ఒకసారి తానే దేనికోసమో వెతుకుతూ చెట్లు పుట్టలు కొండలుదాటి వెళ్లినట్లు, తనకు కావలసిన దెక్కడా కనపడకపోతే నిట్టూర్పుతో యింటికి రాగా ఆవస్తువును భార్య నవ్వుతూ తనచేతిలో పెట్టినట్లు...

అనవసరంగా ఎంతో ప్రయాసపడి నట్లనిపించింది. సిగ్గు పడ్డాడు.

ఒకసారి ఎక్కువ మనోవ్యథతో ఎక్కడికో వేగంగా పరుగెత్తుకొనిపోతున్నాడు. వెనుకనుంచి ఎంతమంది పిలచినా జవాబు చెప్పకుండా పోతున్నాడు. ఎన్నడు చూడని ప్రదేశాల్లోనుంచి నడుస్తున్నాడు. ఒక అందమైన పూలతోట దగ్గరకు వెళ్ళాడు. దాహంవేస్తే ఆపూలలోని తేనెను త్రాగాడు. పూలచెట్లన్నీ అతన్ని చుట్టేశాయి. తెలియకుండానే ఆయాసం తేలిపోయింది. రంగురంగుల పూలను చూస్తూంటే చాలా ఆనందంగా వుంది. ప్రతీ పువ్వుమీదా ఒక అందమైన పిట్ట కూర్చొనివుంది. ఆ పిట్టలలో కొన్ని చక్కగా కూస్తున్నాయి. కొన్నిటికి ఇంద్రధనస్సు రంగులు కలిగిన రెక్కలున్నాయి. ఇవన్నీ చూస్తున్న అతనికి ఎక్కడినుంచో ఒక కంఠధ్వని వినిపించింది.

'నీకిష్టమైన పక్షిని తీసికో' అందా ధ్వని.

ఏమిచేయాలో తోచలేదతనికి. అన్నిపిట్టలూ బాగున్నాయి. ఆత్రుతతో ఒక నీలిరంగు పిట్టను పట్టుకున్నాడు.

'బాగుందా ?' అని అడిగిందా కంఠధ్వని.

ఆలోచించాడు.

'ఈపిట్ట కూయటంలేదు' అన్నాడు.

'నీవు ఆ పక్షిని పట్టుకొనేముందు ఆలోచించలేదు. నీకేమి కావాలో నీకే తెలియలేదు. రంగును చూసి మోసపోయావు'

ఆ జవాబు విని విస్మయపడ్డాడు. కళ్ళలో నీళ్లు తిరిగాయి. ఆ పిట్టమెడ నులిమెయ్యబోతున్నాడు.

ఆగమందా కంఠధ్వని.

'పోనీ నువ్వు పాటలు నేర్పలేవూ?' అంది.

ఆశతో కళ్లు తెరిచాడు. అంధకారంమాత్రం మిగిలింది.

ఎవరిచ్చారీ పదవి వీరికి?

వై. వెంకటరావు

"మన బానిసత్వపు బాధ యీ రోజుతో వదలిపోయింది. దీనికోసం మనమెంతో కృషిచేశాము. ఈ స్వాతంత్ర్యదినం మనకు పర్వదినం. ఈ ఉదయాన్నే నా భార్యతో "ఏమే, మరి మనం అనుకున్నది, కోరినది, కాంక్షించినది, వాంఛించినది ఆ దినం వచ్చింది. ఈ పర్వదినాన్ని సంతోషంగా గడుపుదాం. ఈ రోజున నీకు, నాకు నచ్చిన పిండివంట ఏదైనా తయారుచెయ్యి' అంటే, 'మీకు గారెలు అంటే ఇష్టం, మీకిష్టమయిందే నాకు ఇష్టం. కానీ, ఇంట్లో పప్పూ లేదు, ఉప్పూ లేదు, కొనడానికి డబ్బు లేదు' అని అన్నది. చూశారా, బానిసత్వము వదలినా మనకేవీ అందుబాటులో లేవు. బ్రిటిష్ ప్రభుత్వం ప్రజల్ని, దేశాన్ని ఇంత నీచస్థితిలో విడిచిపోయింది. జీవితావసరానికి వలసిన ఒక్క వస్తువూ మనకి అందుబాటులో లేదు."

స్వాతంత్ర్యదినోత్సవ సందర్భంలో, ఒక కాంగ్రెసునాయకుని ఉపన్యాసధోరణి అది. శ్రుతిమించి రాగాన్ని పడుతోందని గ్రహించిన కొందరి వ్యక్తుల ఆందోళనతో, ఆ ఉపన్యాసం మధ్యలో ముగిసిపోయింది. కాని ఇంకా ఏమి చెప్పేవాడో ఆ మహానుభావుడు! ఆయన మాట్లాడిన